క్లుప్తంగా

నేడు శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక పాత బస్టాండులో వెలసిన శ్రీపద్మావతీ సమేత శ్రీవెంకటరమణుడి ఆలయంలో బుధవారం శ్రీపద్మావతి సమేత శ్రీనివాసుల పరిణయ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు వరదాచార్యులు తెలిపారు. ఈ కల్యాణ మహోత్సవం వెంకటరమణుడు నారాయణవనంలో శ్రీనివాసులు పద్మావతిదేవిని పరిణయమాడిన పర్వదినాన్ని పురస్కరించి ఆలయంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తరించాలన్నారు.

ఘనంగా మారెమ్మ జాతర

చింతకొమ్మదిన్నె : బుగ్గలేటిపల్లె సమీపంలోని ఏఎల్ కాలనీలో మంగళవారం కాలనీ వాసులు మారెమ్మతల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మహిళలు బంధు మిత్రులతో కలసి బోనాలు పట్టి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు.

ఎంఆర్‌సీకి చేరిన పాఠ్య పుస్తకాలు



పాఠ్య పుస్తకాలను సరి చూసుకుంటున్న ఎంఈఓ-2 సుభాషిణి

కమలాపురం : 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు ఎంఆర్‌సీ కార్యాలయానికి చేరాయి. మంగళవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 1 నుంచి 10వ తరగతి వరకు ఉన్న విద్యార్థులకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు వచ్చాయి. తెలుగు, ఆంగ్ల మాధ్యమానికి చెందిన 40 శాతం పాఠ్య పుస్తకాలు ఎంఆర్‌సీ కార్యాలయానికి చేరినట్లు ఎంఈఓ-2 సుభాషిణి తెలిపారు. మిగిలిన 60 శాతం పుస్తకాలు వారం రోజుల్లో వస్తాయని ఉన్నతాధికారులు తెలియ జేశారని ఆమె తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికే పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం ఆదేశించిందని ఆమె వివరించారు.

మంచినీళ్లు అందించండి మహాప్రభో



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

కమలాపురం : వేసవి కాలంలో మంచినీరు అందించి ఆదుకోండి మహాప్రభో అని అప్పాయపల్లెకు చెందిన నివాసితులు కోరుతున్నారు. మంగళవారం అప్పాయపల్లెలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వెనుక ఉన్న వారు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. దాదాపు రెండు నెలలుగా తమకు మంచినీరు సరఫరా కావడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు కొని తాగుతున్నామని, కూలీ పనులకు వెళ్లే తాము డబ్బులు పెట్టి నీళ్లు కొనాలంటే చాలా ఇబ్బందిగా ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు స్పందించి తమ నీటి కష్టాలు గుర్తించి తాగునీరు సరఫరా చేసి ఆదుకోవాలని వారు కోరారు.

సర్వమతాల సమూహమే భారతదేశం

జమ్మలమడుగు : అన్ని మతాల సమూహమే భారతదేశమని వక్తలు తెలిపారు. ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ ఆధ్వర్యంలో సర్వమత సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భారతదేశంలో కేవలం ఒకమతం కాదని ఎన్నో కులాలు, మతాలు, వివిధ వర్గాల ప్రజలు కలిసిమెలసి ఒకే కుటుంబంగా ఎలాంటి తారతమ్యాలు లేకుండా ప్రశాతంగా జీవనం గడుపుతున్నారు. ఆస్థానయే గౌసియా పీఠాధిపతి కుమారుడు సయ్యద్‌షాతాహీర్‌పీరాఖాద్రీ, డాక్టర్ ఎం.రామమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

కమలాపురం : విద్యా సంవత్సరం ప్రారంభం కాక మునుపే జిల్లాలలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారని వారిపై విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం కమలాపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని జేఎన్‌టీయూ కళాశాల సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు. ప్రకాశం జిల్లా వీరభద్రపురానికి చెందిన రంగారెడ్డి పులివెందులలోని గోవిందరాజ టెక్స్‌టైల్స్‌లో పనిచేస్తున్నాడు. పని నిమిత్తమై పులివెందుల పట్టణానికి వెళ్లి తిరిగి వస్తుండగా వాహనం ఢీకొంది. పరిస్థితి విషమంగా ఉండడంతో కడపకు సిఫార్సు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పడకేసిన పారిశుద్ధ్యం



కొత్తపల్లె రోడ్డులో ప్రవహిస్తున్న మురుగునీరు



చంద్రగిరిలో దర్శనమిస్తున్న చెత్తా చెదారాలు

- ఎక్కడ చూసినా చెత్తా చెదారాలే
- కాలువల్లో నిండి ప్రవహిస్తున్న మురుగునీరు
- పట్టించుకోని అధికారులు

పులివెందుల రూరల్ : మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో మురుగునీరు కాలువల్లోనూ, రోడ్లపైన ప్రవహిస్తోంది. దీంతో వచ్చే దుర్వాసన భరించలేకుండా ఉన్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు నుంచి గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదని వారు వాపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు విడుదలవుతున్నప్పటికీ ఆ నిధులను ఏమి చేస్తున్నారో అర్థం కావడంలేదని గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాలలో నెలకొన్న పారిశుద్ధ్య పనులు చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కాలువల్లో నిండి ప్రవహిస్తున్న మురుగునీరు

కొత్తపల్లె, మోట్నూతలపల్లె, మల్లికార్జునపురం, నల్లగొండువారిపల్లె గ్రామాల్లోని రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో అటువైపు వెళ్లే పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి వెళ్లే రహదారులు మురికిమయంగా మారడంతో గ్రామాల్లోకి వెళ్లాలంటే వారు జంకుతున్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న పారిశుద్ధ్య పనులను చేపట్టి అధికారులు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి. పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్తా చెదారాలు కనిపిస్తున్నాయి. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. అలాగే పందులు కూడా ఎక్కువగా సంచరిస్తున్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలి.

– రాధాకృష్ణ, గ్రామస్తుడు, కొత్తపల్లె, పులివెందుల

అధికారులు గ్రామాల్లో పర్యటించాలి



మండల పరిధిలోని గ్రామాల్లో అధికారులు పర్యటించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి పెట్టాలి. సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం ఎక్కడ చూసినా అధ్వానంగా ఉంది. వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. మురుగునీరు నిల్వ ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్ లేదా మందులను పిచికారి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– చంద్ర, గ్రామస్తుడు,, మోట్నూతలపల్లె, పులివెందుల

ఇంటింటికీ రేషన్ పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల : ఇంటింటికీ రేషన్ పంపిణీ జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, అనధికారికంగా రేషన్ డీలర్ల వద్ద పంపిణీ చేస్తున్న విషయాన్ని తెలిపినా ఉన్నతాధికారులు స్పందించకపోవడం దారుణమని వైఎస్సార్‌సీపీ పులివెందుల పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిశోర్, వైఎస్సార్‌సీపీ ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడు మారుతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కార్తీక్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షులు పోరెడ్డి జశ్వంత్‌రెడ్డిలు తెలిపారు. మంగళవారం స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పులివెందులలో ప్రభుత్వం అందించే బియ్యం గింజలు పొందాలంటే కూలీ పనులు చేసుకునే వారికి ఒక్కరోజు కూలీ పోవాల్సిందేనని, ఆ విధంగా అధికారులు కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి తమ ఇంటి వద్దకే వెళ్లి ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేసేవారని, కానీ ప్రస్తుతం పులివెందులలో పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. రేషన్ డీలర్లు తమకు వచ్చిన స్టాక్‌ను ఎండీయూ వాహనదారులకు ఇవ్వకుండా అరకొరగా, సమయ పాలన లేకుండా తూతూ మంత్రంగా తమ అనధికార స్టాకు పాయింట్లను రేషన్ షాపులుగా మార్చుకుని బియ్యం పంపిణీ చేస్తున్నారన్నారు. కూలీ పనులు చేసుకునే వారు రేషన్ పొందాలంటే కచ్చితంగా ఒక్కరోజు సెలవు తీసుకుని రేషన్ షాపుల దగ్గర నిరీక్షించాల్సిందేనన్నారు. అసలు రేషన్ షాపు డీలర్లకు రేషన్ పంపిణీ చేయడానికి ప్రభుత్వం అధికారికంగా ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయలేదని, కానీ ఎండీయూ ఆపరేటర్లను జీతం రాకుండా చేస్తాం అంటూ బెదిరించి ఎండీయూ ఆపరేటర్లతో తమ బయోమెట్రిక్ ద్వారా రేషన్ డీలర్ వద్దే ప్రజల వేలిముద్రలు తీసుకుని రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా ఇక్కడ ఇంత తతంగం జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రేషన్ బియ్యం ఇంటింటికి పంపిణీ జరిగేలా చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ తరపున వారు డిమాండ్ చేశారు.

ఆలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి



దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్యకు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

వేంపల్లె : రాయలసీమ జిల్లాలో ప్రసిద్ధి గాంచిన పవిత్ర పుణ్యక్షేత్రం గండి ఆలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించాలని ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్ రెడ్డి తెలిపారు. మండలంలోని గండి దేవస్థానాన్ని మంగళవారం స్థానిక బీజేపీ నాయకులతో కలసి ఆయన పరిశీలించి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.26 కోట్లతో ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టి నాలుగేళ్లు గడుస్తున్న ఇంతవరకు పూర్తి కాలేదన్నారు. నాలుగేళ్ల నుండి స్వామివారిని బాలాలయంలో దర్శించుకుని భక్తులు వెను తిరుగుతున్నారన్నారు. ఏటా రూ.5 కోట్ల ఆదాయం ఉన్న అతిపెద్ద దేవాలయం గండి క్షేత్రమని, ఇంత ఆదాయం ఉన్నా. ఇంతవరకు ఎందుకు పూర్తి చేయలేదని ఆయన అధికారులను ప్రశ్నించారు. శ్రావణ మాసంలోపు ఆలయ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఇప్పటికైనా దేవస్థాన అధికారులు గండి ఆలయ పునర్నిర్మాణం పనులపై శ్రద్ధ పెట్టి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఏఎన్ఎంల నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు

తొండూరు : విధి నిర్వహణలో భాగంగా వైద్య సేవలు అందిస్తున్న ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లను, మిగతా సిబ్బందికి చదువురాదని, వారికి జీతాలు చెల్లించడం వృథా అని అనడం వారిని అవమానపరచడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు డాక్టర్ అరిపుల్లాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల తరబడి వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న మాకు చదువురాని వారని, మాకు వేలాది రూపాయలు చెల్లించడం అవసరంలేదని డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న కొంతమంది మాట్లాడటం అవమానపరచడమేనన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో వందశాతం ఆసుపత్రులలో ప్రసవాల అమలు కృషి నిత్యం ప్రజలతో ఉండి కరోనా వంటి కబంధ హస్తాల నుంచి ప్రజల ప్రాణాలను కాపాడిన మమ్ములను హేళనగా మాట్లాడటం బాధాకరమన్నారు.

ఏఎన్ఎంల నిరసన

చింతకొమ్మదిన్నె : ఏఎన్ఎంలు, ఆరోగ్య పర్యవేక్షకులపై అదే శాఖలోని ఉద్యోగులు సోషల్ మీడియా వేదికగా చేసుకుని కించపరుస్తు మాట్లాడటంపై మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏఎన్ఎంలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు స్థానిక వైద్యాధికారి డాక్టర్ రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు.

జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరికి రక్త పరీక్షలు చేయించాలి



మాట్లాడుతున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య

వేంపల్లె : జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరికి రక్తపూతలు తప్పనిసరిగా చేయించాలని ఆశా డే కార్యక్రమ వైద్యాధికారి డాక్టర్ పృథ్వీకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య కార్యకర్తలకు, ఆశా కార్యకర్తలకు ఫ్రైడే-డ్రైడే ప్రాముఖ్యత గురించి మలేరియా, డెంగీ వ్యాధుల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలకు మలేరియా రక్తపూతల టార్గెట్‌ను ప్రతి ఆరోగ్య కార్యకర్త పూర్తి చేయాలని, ప్రతి బుధ, శనివారాలలో రక్త పూతలు ల్యాబ్‌కు ఇవ్వాలని తెలిపారు. అనంతరం సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య మాట్లాడుతూ ప్రతి శుక్రవారం సచివాలయం పరిధిలోని ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్, షఫీ వున్నిస బేగం సీహెచ్ఓ వెంకటరత్నం, ఎంపీహెచ్ఈఓ బాబా ఫక్రుద్దీన్, సూపర్ వైజర్లు వెంకటలక్ష్మమ్మ, అరుణదేవి, ల్యాబ్ టెక్నీషియన్ హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అకస్మికంగా తనిఖీ

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్ఓ నాగరాజు అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పీహెచ్‌సీలోని పలు రికార్డులు, మందులను పరిశీలించారు. అనంతరం ఏఎన్ఎంకు నిర్వహించిన ఆశాడే మీటింగ్‌లో పాల్గొని గ్రామాలల్లో ప్రజలకు తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో వైద్యు లు ఖాజా, వినయ్‌కుమార్‌రెడ్డి, ఎంపీహెచ్ఎస్ రాఘవ, ఎంపీహెచ్ఈఓ రామప్రతాప్ పాల్గొన్నారు.

నేడు ఉత్సవాలు

వల్లూరు : స్థానికంగా ఉన్న శ్రీ వాసవీకన్యకా పరమేశ్వరీదేవి అమ్మవారి శాలలో బుధవారం వాసవీ మాత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్య వైశ్య సంఘ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకం, సాయంత్రం గ్రామోత్సవం రాత్రి భజన కార్యక్రమం ఉంటుందన్నారు.

నేడు ఆరాధన మహోత్సవం

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మగూడూరు గ్రామంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం వీరబ్రహ్మేంద్ర స్వామి 22వ ఆరాధన మహోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆరాధన సందర్భంగా బుధవారం ఉదయం స్వామివారికి పూజాది కార్యక్రమంతోపాటు తాళాల భజన, కోలాట ప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోండి

పులివెందుల టౌన్ : మైనార్టీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా జిల్లాలోని మైనార్టీస్ లబ్ధిదారులకు ఎకనామిక్ సపోర్ట్ స్కీం కింద నాలుగు శ్లాబ్‌లలో సబ్సిడీ రుణాలు ఇవ్వనుందన్నారు. వివరాలకు 9290448452, 08562–241137 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

అక్రమ తవ్వకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

వీరపునాయునిపల్లె : గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్వాహకులు చేపడుతున్న అక్రమ తవ్వకాలపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సభా భవనంలో మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మండలస్థాయి అధికారులు తమ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం మండల అధ్యక్షుడు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పనుల్లో తీవ్రస్థాయిలో అక్రమాలు జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చాయని అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు నిర్వహిస్తున్న గుత్తేదారులు ఎటువంటి అనుమతులు లేకుండా తవ్వేయడం జరుగుతోందన్నారు. ఎటువంటి రాయల్టీ చెల్లించకుండా క్రషర్‌లు ఏర్పాటు చేసి అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్నా రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తూ ఉండటం చాలా దారుణమన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్ అధికారులు అక్రమ తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తహసీల్దార్ లక్ష్మీదేవి మాట్లాడుతూ రెవెన్యూ అధికారులదే బాధ్యత కాదని మైనింగ్ అధికారులకు కూడా బాధ్యత ఉందని అందరూ కలసికట్టుగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్, వైద్యాధికారి మహమ్మద్ తాహా, సర్పంచులు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సరస్వతిదేవి అలంకారంలో వాసవీమాత



సరస్వతిదేవి అలంకారంలో వాసవీమాత

పులివెందుల టౌన్ : స్థానిక అమ్మవారిశాలలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి జయంతి మహోత్సవాలలో భాగంగా మంగళవారం వాసవీమాత సరస్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శాశ్వత ఉభయదారుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శంకరయోగి నవీన్‌కుమార్‌శర్మ మంగళవారం ఉదయం అభిషేకం అనంతరం మహా మంగళ హారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం లలిత సహస్ర పారాయణం, కుంకుమార్చనలు, ఆర్యవైశ్య మహిళలతో 108 హారతులతో అమ్మవారికి మంగళ హారతులు పట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేసు శ్రీనివాసులు, కార్యదర్శి సగళా మహేంద్రబాబు, కోశాధికారి సుబ్రమణ్యం, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, ఫంక్షన్ హాల్ కోశాధికారి కాంబోజి, ఉభయదారులు వంకధార రాజశేఖర్, మేడా జగదీష్, మిట్టా వెంకట శ్రీహరి, సుధీర్ కుమార్, గంగాధర్, ఆహోవా, వాసవీక్లబ్, ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు, పాల్గొన్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేస్తే శిక్ష తప్పదు



మైనర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ నరసింహులు

వేంపల్లె : మైనర్లు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులకు శిక్ష తప్పదని సీఐ నరసింహులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో సీఐ పోలీసు సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బైకులు నడుపుతున్న మైనర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రతిరోజు ప్రపంచంలో నలుమూలల ఏదో ఒక యాక్సిడెంట్ సంబంధించిన వార్తలను మనం వింటూనే ఉంటామని, ఒకరు చేసిన తప్పుకు ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో కొందరు వ్యక్తులు మద్యం సేవించి రోడ్డు మీద మితిమీరిన వేగంతో వెళుతూ అదుపు తప్పి ప్రాణాలు కోల్పోయినవారు ఎందరో ఉన్నారన్నారు. ప్రస్తుత రోజుల్లో కొందరు పిల్లలు కూడా కార్లు, బైకులు వేసుకుని రోడ్లపై అటూ ఇటూ ఇష్టానుసారం వెళ్లడం గమనిస్తూనే ఉన్నామన్నారు. ఇలాంటి ఘటనలవల్ల ఈ మధ్యకాలంలో చాలా మంది అమాయకుల ప్రాణాలు పోయిన వార్తలు మనం చాలానే చూశామని, మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే మాత్రం అది చట్టరీత్యా నేరమన్నారు. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు బైకు ఇస్తే వారిపైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీసీల పేరుతో బహిరంగ దోపిడీ



అర్డీఓ సాయిశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు

కొండాపురం : బీసీల పేరుతో కూటమి ప్రభుత్వం బహిరంగ దోపిడీకి పాల్పడుతోందని జమ్మలమడుగు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బీసీసెల్ అధ్యక్షుడు జె.ప్రవీణ్‌కుమార్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జి. గురుమూర్తిలు విమర్శించారు. మంగళవారం జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ సాయిశ్రీకి వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకర్లతో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ, శిక్షణ కోసం ప్రభుత్వం రూ.230 కోట్లు కేటాయించిందని కూటమి పార్టీల అనుకూల కాంట్రాక్టర్ల ద్వారా భారీ దోపిడీకి పన్నాగం పన్నుతోందని వారు ఆరోపించారు. ఇటీవల రాష్ట్ర వ్యా ప్తంగా లక్ష మంది మహిళలకు 50 రోజుల పాటు కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని కూటమి ప్రభు త్వం ప్రారంభించిందన్నారు. శిక్షణకు హాజరై ప్రతి బీసీ మహిళలకు రూ.3 వేల స్టైఫండ్‌తో పాటు శిక్షణ అనంతరం కుట్టుమిషన్ ఉచితంగా అందచేసేలా కార్యాచరణ రూపొందించారు. ఇందుకోసం ఒక్కొక్క లబ్ధిదారుడికి రూ.23 వేలు వెచ్చిస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించిందన్నారు. శిక్షణ కాలంలో చెల్లించే స్టైఫండ్ ఉచితంగా అందించే కుట్టుమిషన్ పోను మిగితా డబ్బులు నొక్కేశారని వారు ఆరోపణలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు అయ్యే ఖర్చు రూ. 73 కోట్లు పోను మిగిలిన రూ.167 కోట్లను దిగమింగేశారన్నారు.

దోమ కాటు ఆరోగ్యానికి చేటు



మాట్లాడుతున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య

వేముల : దోమకాటు ఆరోగ్యానికి చేటు అని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య తెలిపారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు ఫ్రైడే – డ్రై డే ప్రాముఖ్యత గురించి, మలేరియా, డెంగీ వ్యాధు గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు మలేరియా రక్తపూతల టార్గెట్‌ను ప్రతి ఆరోగ్య కార్యకర్త పూర్తి చేయాలని, ప్రతి బుధ, శనివారాలలో రక్తపూతలు ల్యాబ్‌కు ఇవ్వాలన్నారు. గ్రామాలలో ప్రజలకు దోమకాటు వల్ల వచ్చు వ్యాధుల గురించి అవగాహన కల్పించాలని, ప్రతి శుక్రవారం సచివాలయం పరిధిలోని ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించాలన్నారు. దోమలు పెరుగుదలకు కారణమైన నీటి నిల్వలను తొలగించేలా ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రెడ్డెమ్మ, సూపర్‌వైజర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

జమ్మలమడుగు : బడి ఈడు పిల్లలకు బడిలో చేరుద్దామని ప్రధానోపాధ్యాయుడు కె.హరి మధుసూదనరావు పిలుపునిచ్చారు. మంగళవారం మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో బడి ఈడు పిల్లలను బడిలో చేరుద్దాం అంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో తమ పాఠశాల నుంచి విశ్వనాథ్, గౌస్‌యాజ్‌దానిలకు అత్యధికంగా 585 మార్కులు వచ్చాయని, రాగప్రియకు 580, అనూషకు 574 మార్కులు సాధించారన్నారు. 32 మందికిపైగా 500 మార్కులు సాధించారన్నారు. పాఠశాల స్థాపించినప్పటి నుంచి 585 మార్కులు రావడం ఇదే మొదటి సారి అని సూచించారు. తమ పాఠశాల నుంచి చాలా మంది విద్యార్థులు ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌లకు సాధించిన వారు ఉన్నారన్నారు. కాబట్టి విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను పాఠశాల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు



గూడెంచెరువులో ఇంటి నిర్మాణం కోసం వేసిన బేస్ మట్టం

జమ్మలమడుగు : గూడెంచెరువు, పొన్నతోట పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను, ఇళ్ల స్థలాలుగా మార్చుకుని ఒక్కొక్కరు మూడు నాలుగు ఇళ్లకు నిర్మాణాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని దళిత సంఘం నాయకుడు బరిగేల రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నిరుపేదలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్లను కట్టించి ఇచ్చారు. ప్రస్తుతం ఆ ఇళ్లల్లో నిజమైన లబ్ధిదారులు కాకుండా స్థానికంగా లేని వారు నివాసం ఉంటున్నారు. చుట్టు పక్కల ఖాళీగా ఉన్న స్థలాలను కబ్జాలు చేసుకుని చాలా మంది ఒక్కొక్కరు ఐదు ఆరు వరకు వరుసగా బెస్ మట్టాలు వేసి వాటిని అమ్ముకుంటున్నారన్నారు. అప్పటి వీఆర్ఏ, ఎమ్మార్వోలకు వివరించిన ఎటువంటి ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. ప్రస్తుత తహసీల్దార్ శ్రీనివాసులరెడ్డి ఈ నిర్మాణాలపైన దృష్టి సారించి నిరుపేదలకు న్యాయం చేయాలని కోరారు.

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

సింహాద్రిపురం : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత కుమారి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం-వేసవి సెలవుల శిక్షణ కార్యక్రమాల ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ వసంతకుమారి మాట్లాడుతూ ఈనెల 2వ తేదీ నుంచి జూన్ 4వ తేదీ వరకు కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రత, నెలసరి సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది, కిశోర బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

కిశోరి వికాసం బాలికల బంగారు భవితకు పునాది

పులివెందుల రూరల్ : కిశోరి వికాసం బాలికల బంగారు భవితకు పునాది అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత తెలిపారు. మంగళవారం పట్టణంలోని అంగన్‌వాడా కేంద్రం–సెక్టార్ 3లో కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, రుతుస్రావ పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.